క్లుప్తంగా

25న మండల సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ డేవిడ్ రాజ్ కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయలో సోమవారం విద్యార్థులకు స్టోరీ రీడింగ్, స్టోరీ రైటింగ్‌లో మెళకువలు నేర్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు



జగపతినగరంలో పంట కాలువలను బాగు చేస్తున్న ఉపాధి కూలీలు

కిర్లంపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. జగపతినగరంలో సోమవారం ఉపాధి కూలీలు పలు పంట కాలువను బాగు చేశారు. ఉపాధి ఏపీఓ కె.నాగమణి పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. వ్యవసాయ పనులు లేని తరుణంలో కూలీలకు ఈ పనులు ద్వారా ఉపాధి కలుగుతోంది. ఇటీవల ప్రభుత్వం కూలి రేట్లు సైతం పెంచింది. గతంలో ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.272 ఉండగా ఇటీవల ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.300లకు పెంచింది. దీంతో ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. గ్రామాల్లో ఉపాధి జాబ్ కార్డులు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

దృఢసంకల్పంతో సాగితే విజయం

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరంలో భాగంగా సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఐడీఎస్ఎస్‌సీ 2024కు ఎంపికైన క్యాడెట్ల శిక్షణ శిబిరంలో భాగంగా పెద్దాపురంలో ప్రముఖ గైనకాలజిస్ట్ విజయలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాకినాడ 18వ ఆంధ్రా బెటాలియన్, కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దృఢసంకల్పం, ఆత్మ విశ్వాసంతో సాగితే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చన్నారు. ఎన్‌సీసీతో మంచి భవిష్యత్తు ఉంటుదన్నారు. క్యాడెట్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సురక్షిత జీవనాన్ని సాగించాలని అన్నారు. ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

ముందుక్కు సాగుతూ..

- మెట్టలో ముమ్మరంగా వేసవి దుక్కులు
- భూసారం వృద్ధి, తెగుళ్ల నివారణ
- అధిక దిగుబడులకు అవకాశం



ఒమ్మంగిలో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

ప్రత్తిపాడు రూరల్: భూమి సారవంతంగా ఉంటేనే దిగుబడులు బాగుంటాయి. వరుస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమయ్యే ప్రమాదం ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన రైతులు వేసవిలో ఆయా పొలాల్లో దుక్కులు చేపట్టి, భూసారాన్ని పెంచుకుంటారు. వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని గమనించిన రైతులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో రైతులు వేసవి దుక్కులను ముమ్మరం చేశారు.

15,577 ఎకరాల వ్యవసాయ సాగు

ఖరీఫ్‌లో వరి సాగు చేసే పొలాల్లో వేసవి దుక్కలు చేయడం ఎంతో లాభదాయకం. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పోతులూరు, ధర్మవరం, వాకపల్లి, శరభవరం, గజ్జనపూడి, ఒమ్మంగి, చింతలూరు, ఉత్తరకంచి తదితర గ్రామాల్లో వేసవి దుక్కులు ఊపందుకున్నాయి. మండలంలో 15,577 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. ఇందులో 10,500 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో ప్రత్తి, 925 ఎకరాల్లో మినుములు, 105 ఎకరాల్లో పెసలు, 2,547 ఎకరాల్లో ఇతర పంటలను రైతులు సాగు చేసే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి వై.గంగాధర్ తెలిపారు.

ప్రయోజనాలు ఇలా...

వేసవిలో పొలాలను దుక్కు చేయడం వల్ల గడ్డి నశించిపోవడంతో పాటు వరిమోళ్లు కుళ్లిపోయి భూమిలో కలిసిపోతాయి. కాలక్రమేణా ఇవి ఎరువుగా మారతాయి.

భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుని తదుపరి సాగు చేసే పంటకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి. పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆయా పొలాల్లో పురుగుల ఉధృతి తగ్గుతుంది. తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడా ఎండలకు చనిపోయే అవకాశం ఉంది. తరువాత సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు. రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాలలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూసారం మరింత పెరుగుతుంది.

వేసవి దుక్కులతో భూసారం పెంపు



పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తే భూసారం తగ్గుతుంది. ఈ సమస్యను నివారించేందుకు పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ తరువాత అపరాలు సాగు చేసే భూముల్లో కాకుండా ఖాళీ పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టడం వల్ల చెడు పురుగులు, శిలీంద్రాలు చనిపోతాయి. గడ్డి,గరప కుళ్లిపోయి నేల సారవంతంగా మారుతుంది. ఈ విధంగా చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా దిగుబడులు పెరుగుతాయి.

– వై.గంగాధర్, మండల వ్యవసాయ అధికారి, ప్రత్తిపాడు

ఎన్నికల సిబ్బందికి అభినందనలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రంగారావు

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా, సజావుగా నిర్వహించేందుకు సహకరించిన ఎన్నికల సిబ్బందిని తహసీల్దార్ వై.రంగారావు అభినందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేశారన్నారు. ఎటువంటి అక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి బాధ్యతతో పని చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఎన్నికలకు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వీఆర్వోలు అవసరాల కిషోర్, సత్యారావు, రొంగల శ్రీను, వీరేశ్వరరావు, చంటిబాబు, అప్పారావు, శ్యామల, చంటిబాబు, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

'నాడు–నేడు' పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వరరావు

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దాపురం డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, సచివాలయ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాలువలు



పెద్దిపాలెంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్న సుబ్బారెడ్డిసాగర్ ఏటి కాలువ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పది వేల ఎకరాలకు సాగునీరు అందించే మధ్యతరహా సాగునీటి జలాశయం సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ, పంట కాలువలు అధ్వానంగా మారాయి. కాలువల్లో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు విస్తారంగా పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. వచ్చే ఖరీఫ్‌కు ముందే ఈ కాలువల్లో పిచ్చి మొక్కలను తొలగించి, పూడికతీత పనులు చేపట్టకుంటే నీరు ముందుకు ప్రవహించే పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలను అభివృద్ధి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

శంకరరావుకు డాక్టరేట్



శంకరరావుకు డాక్టరేట్ అందజేస్తున్న తహసీలార్లు

తుని: సామాజిక సేవలో విశేష కృషి చేసిన ఆలంక శంకరరావును డాక్టరేట్ వరించింది. హర్యానా రాష్ట్రానికి చెందిన ఎంబీఆర్ యూనివర్సిటీ సమాజంలో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు ఏటా డాక్టరేట్ ప్రదానం చేస్తోంది. 2024 సంవత్సరానికి గాను తునికి చెందిన విశ్రాంత విద్యుత్‌శాఖ ఉద్యోగి అలంక శంకరరావుకు ఈ అవార్డు దక్కింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తుని, తొండంగి మండలాల తహసీల్దార్లు వీవీ భరత్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఎంబీఆర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ గణగళ్ల విజయ్‌కుమార్ చేతుల మీదుగా శంకరరావుకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎంబీఆర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ 1955లో అనకాపల్లిలో జన్మించిన శంకరరావు విద్యుత్‌శాఖ ఉన్నత ఉద్యోగిగా 2018లో ఉద్యోగ విరమణ చేశారన్నారు. బాధ్యత గల ప్రభుత్వోద్యోగిగా సమాజానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ అవార్డుకు దేశంలో 26 మందిని ఎంపిక చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి శంకరరావుకు ఈ అవార్డు దక్కిందన్నారు. అవార్డు గ్రహీత శంకరరావును విద్యుత్‌శాఖ చీఫ్ జనరల్ మేనేజర్(అకౌంట్స్) కేఎస్ భాస్కరరావు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఆర్వీ రమణారావు, ఆల్‌ఇండియా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఐజక్ రాజు, జనరల్ సర్జన్ డాక్టర్ అల్లాడి ఉమామహేశ్వరరావు, సౌత్ సెంట్రల్ రైల్వే ఉద్యోగి కిల్లాడ ఏడుకొండలు అభినందించారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయమాధవి

కోటనందూరు: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయమాధవి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీటి నిర్వహణపై పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి పారుదల శాఖల సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాధవి మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ట్యాంకర్లను శుభ్రం చేసి నీటి నాణ్యత పరీక్షించాలని సూచించారు. మంచినీటి సరఫరాలో ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్ పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మృతి చెందిన మృతుడి ఆచూకిని పోలీసులు కనుగొన్నారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం... జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొమ్మరాజుల హరీష్ (30) ప్రత్తిపాడులోని బంధువుల ఇంటికి వచ్చాడు. స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో హరీష్ మృతి చెందినట్టు తెలిపారు. స్థానిక వీఆర్వో మొల్ల శ్రీనుబాబు ఇచ్చిన ఫిర్యాదుపై ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

కరప: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలవ్వగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన మేడిశెట్టి నాగబాబు టైల్స్ పనిచేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం నాగబాబు కరప వచ్చి పని ముగించుకుని మోటార్ సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా పెనుగుదురు వంతెన దిగువన ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగబాబు తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు తల్లి మేడిశెట్టి లక్ష్మీనరసమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్కారు సేవలకు సొంత భవనాలు

- గ్రామాల్లో జోరుగా భవనాల నిర్మాణం
- ఐదేళ్లలో పెరిగిన ప్రభుత్వ ఆస్తులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



టి.వెంకటాపురం గ్రామస్తులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్న సచివాలయం, ఆర్‌బీకేలు

తుని రూరల్: గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు రూ.కోట్ల విలువైన సొంత భవనాలు సమకూరుతున్నాయి. వివిధ గ్రాంట్లు మంజూరు కావడంతో పలు రకాల సేవలకు పక్కా భవనాలు నిర్మితమవుతుండగా ప్రభుత్వానికి రూ.కోట్లు విలువ చేసే ఆస్తులు సమకూరుతున్నాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లో రూ.50.13 కోట్లతో 180 సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ల (హెల్త్ క్లినిక్‌లు) నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికే 50 శాతం వరకు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. రోడ్లు,భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఇప్పటికే పూర్తయిన భవనాలను ప్రారంభించడంతో ఆయా కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గతంలో మండల కేంద్రాలకు పరుగులు

2019కి ముందు ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సొంతూళ్లలోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ఇందు కోసం గ్రామాల్లో రూ.40 లక్షల నుంచి రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం, వ్యవసాయ సంబంధిత సేవలకు రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం, వైద్య సేవలకు రూ.18.50 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లను నిర్మించారు. దీంతో ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

నియోజకవర్గంలో ప్రభుత్వ భవనాల వివరాలు

భవనం పేరు	మంజూరైనవి	పూర్తయినవి	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
గ్రామ సచివాలయాలు	67	37	రూ.26.05
రైతు భరోసా కేంద్రాలు	58	19	రూ.13.94
వెల్‌నెస్ సెంటర్లు	55	7	రూ.10.14
మొత్తం	180	63	రూ.50.13

సొంతూరులోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు



వి.కొత్తూరు పంచాయతీలో కలసి ఉన్న మా గ్రామాన్ని లోవ కొత్తూరు పంచాయతీగా విభజించారు. మొదట్లో అద్దె భవనంలో పంచాయతీ సేవలు అందించారు. రూ.43.60 లక్షలతో సచివాలయ భవనం నిర్మించడంతో ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే పొందుతున్నాము.

– లంక కృపానందం, లోవకొత్తూరు

ఊర్లోనే వైద్య సేవలు



నాలుగేళ్లకిందట వైద్యానికి తేటగుంట పీహెచ్‌సీకి, తునిలో ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. రెండేళ్లకిందట మా గ్రామంలో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. వైద్యులన్నీ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు ఉన్న ఊర్లోనే వైద్య సేవలు, ఉచితంగా మందులు అందుతున్నాయి.

– పప్పు వెంకటరమణ, టి.వెంకటాపురం

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పిఠాపురం ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి



కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఆర్వో వెంకటరావు

పర్యవేక్షించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: వచ్చే నెల 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు సోమవారం పర్యవేక్షించారు. కౌంటింగ్ కోసం ఏర్పాటు చేయాల్సిన టేబుళ్లు, విధుల్లో ఉండే సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర అంశాలపై ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్వో చెప్పారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఏఈ రమేష్‌బాబు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నాయుడు, సర్వేయర్ ఆచార్యులు తదితరులు ఉన్నారు.

- స్థానిక జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్వో వెంకటరావు సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పర్యవేక్షణకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామని, మూడంచెల భద్రతతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

ఏజెంట్ల వివరాలు తెలపండి

ఎన్నికల కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్ల వివరాలను కనీసం 10 రోజుల ముందే తమకు తెలిపాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటరావు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి తరఫు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల తరఫు ఏజెంట్లకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా తెలియజేస్తే విచారణ అనంతరం వీరికి పాస్‌లు అందజేస్తామన్నారు. వచ్చేనెల 4న ఉదయం తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తామని, సమాంతరంగా ఈవీఎంల లెక్కింపు ప్రారంభిస్తామని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్ఓ చల్లన్నదొర, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి కాకినాడ జేఎన్టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లి అక్కడ భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

భూదాన భూమిని స్వాధీనం చేయాలని వినతి



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

ఏలేశ్వరం: భూదాన బోర్డు ద్వారా పట్టాలు ఇచ్చిన భూమిని తమకు స్వాధీనం చేయాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మండలంలోని తిరుమాలిలో గతంలో భూదాన బోర్డు ద్వారా సుమారు 19 కుటుంబాలకు పట్టాలు ఇచ్చారు. ఆ భూమిని వారికి అప్పగించకపోవడంతో తమకు న్యాయం చేయాలంటూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గతంలో తమకు పట్టాలు ఇచ్చినా ఆ భూమిని యజమానే సాగు చేసుకుంటున్నారని, తమకు భూమి స్వాధీనం చేయాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రంగారావు, ఎస్సై జిసతీష్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం



సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం నిర్వహించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు సామూహిక లక్ష్మీనారాయణ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం శ్రీకృష్ణ తులాభారం నిర్వహించారు. నిత్య పూజలు, కైంకర్యాల్లో ధర్మకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సుదర్శన హోమం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి సుదర్శన హోమం, సాయంత్రం అన్నమాచార్య కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.